క్లుప్తంగా

భగవద్గీత పారాయణం

భీమవరం: భీమవరం చిన్మయమిషన్ ఆధ్వర్యంలో ఆర్యవైశ్య వర్తక సంఘ భవనంలో శనివారం ప్రపంచ చిన్మయమిషన్ వ్యవస్థాపకుడు గురుదేవులుస్వామి చిన్మయనంద 31వ ఆరాధన శుభదినం సందర్భంగా గురుదేవుల పాదుక పూజ, సామూహిక సంపూర్ణ భగవద్గీత పారాయణం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్వామి సర్వేశానందజీ హాజరై అనుగ్రహ భాషణం చేశారు. భక్తులతో భీమవరం చిన్మయమిషన్ ఆచార్యులు ఈశాని చైతన్య ఆధ్వర్యంలో భగవద్గీత పారాయణం నిర్వహించారు. చిన్మయ మిషన్ అధ్యక్షుడు మడిపల్లి శేఖర్, కార్యదర్శి కొత్త శ్రీనివాస్, మిషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఢిల్లీకి వీరవాసరం ఎంపీపీ

వీరవాసరం: ఆగస్టు 15 స్వాతంత్ర దినోత్సవం పురస్కరించుకొని ఢిల్లీలోని ఎర్రకోటలో నిర్వహించే స్వాతంత్ర దినోత్సవ సంబరాల్లో పాల్గొనడానికి ఆహ్వానం అందడం ఎంతో ఆనందంగా ఉందని వీరవాసరం ఎంపీపీ వీరవల్లి దుర్గా భవాని శనివారం తెలిపారు.

గిరిజన బాలుర హాస్టల్లో వైద్య శిబిరం

భీమవరం: మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం భీమవరం బ్రిడ్జిపేటలోని గిరిజన బాలుర హాస్టల్లో వైద్య శిబిరం, న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని గునుపూడి యామిజాలవీధిలోని పీహెచ్‌సీ డాక్టర్ రఫీవుద్దీన్ మాట్లాడుతూ విద్యార్థులు సిగరెట్లు, మద్యపానం, డ్రగ్స్‌కు ఆకర్షితులై ఆరోగ్యం పాడుచేసుకోవద్దన్నారు. అనంతరం విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఆశా వర్కర్లు, హాస్టల్ వార్డెన్ డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అవయవాలు దానం చేయండి

ఉండి: అవయవాల దానం మహత్కార్యమని మండల మానవతా స్వచ్ఛంద సేవాసంస్థ మండలాధ్యక్ష కార్యదర్శులు పెన్మత్స రామకృష్ణంరాజు, గాదిరాజు రంగరాజు అన్నారు. శనివారం మండలంలోని కలసిపూడిలో ప్రపంచ అవయవ దాన అవగాహన దినోత్సవాన్ని స్థానిక హెచ్ఎం ముదునూరి సుధారాణి అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో అవయవాలు దానం ఆవశ్యకతను వివరించారు. మండల కో చైర్మన్ దంగేటి రామలింగేశ్వరరావు, విద్యార్థులు, తల్లిదండ్రులుపాల్గొన్నారు.

కేరళ బాధితుల సహాయార్థం విరాళాల సేకరణ

ఉండి: ప్రకృతి వైపరీత్యంతో ఎంతో ఆపదలో ఉన్న కేరళ తదితర రాష్ట్రాల వాసులకు ఆర్థికంగా అండగా నిలిచేందుకు ప్రతి ఒక్కరూ విరాళాలు అందజేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జేఎన్‌వీ గోపాలన్ కోరారు. సీపీఎం మండల కార్యదర్శి ధనికొండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం ఉండి సెంటర్‌లో కేరళ బాధితుల సహాయార్థం విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ కేరళ రాష్ట్రం వయనాడ్‌లో కొండచరియలు విరిగి వందలాది మంది తీవ్ర గాయాల పాలవ్వడమే కాకుండా ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారని అన్నారు.వరద బాధితులకు అందరూ అండగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రామకూరి వెంకటరత్నం, నక్కా వెంకటేశ్వర్లు, వీరవల్లి శ్రీనివాస పాల్గొన్నారు.

డేటా ఎంట్రీ ఆపరేటర్ల సమస్యలపై వినతి



భీమవరంలో ఎమ్మెల్యే అంజిబాబుకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

భీమవరం: గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న ఈ-పంచాయత్ డేటా ఎంట్రీ ఆపరేటర్లు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు)కు శనివారం వినతిపత్రం అందజేశారు. భీమవరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గం ఈ-పంచాయత్ డేటా ఎంట్రీ ఆపరేటర్లు వినతిపత్రం అందించిన అనంతరం డేటా ఎంట్రీ ఆపరేటర్లు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ పంచాయతీలో సుమారుగా రెండువేల మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లుగా తక్కువ వేతనంతో పని చేస్తున్నామన్నారు. మినిమం టైం స్కేల్ అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. దీనిపై స్పందించిన అంజిబాబు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కె. సంతోష్ కుమార్, వైడీ సాయికృష్ణ, కె.ఫణి శ్రీనివాస్, వి.రాజు పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి - కేసు నమోదు

ఉండి: డబ్బులు అడిగితే ఇవ్వనందుకు ఇద్దరు వ్యక్తులు దాడికి దిగారు. దీనిపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉండి మండలం పాందువ్వ గ్రామానికి చెందిన మాదాసి రామయ్యను అదే ప్రాంతానికి చెందిన పెల్లూరి ఏసురత్నం ఈ నెల 1న తనకు డబ్బులు కావాలని ఇవ్వమని అడిగాడు. తన వద్ద డబ్బులు లేవని చెప్పడంతో ఏసురత్నంతో పాటు లక్ష్మణరావు కలిసి రామయ్యతో గొడవకు దిగి అతన్ని కొట్టారు. రామయ్య సోదరుడు తన అన్నను ఇంటికి తీసుకుపోయాడు. ఏసురత్నం, లక్ష్మణ్ ఇంటికి వచ్చి చంపుతామని బెదిరించారని రామయ్య ఫిర్యాదు చేశారు. ఎస్సై ఎం లక్ష్మణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అమృతం కన్నా అమ్మపాలు మిన్న

- ముర్రుపాలు టీకాతో సమానం
- తల్లిపాల ప్రయోజనాలపై అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహన కార్యక్రమాలు
- గర్భిణులు, బాలింతలకు పోషకాహారం పంపిణీ



పోషకాహారం పంపిణీ చేస్తున్న అధికారులు



తల్లిపాల ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

పాలకోడేరు: శిశువు శారీరక ఎదుగుదలకు అవసరమైన పోషకాలకు, వారి సంపూర్ణ ఆరోగ్యానికి తల్లిపాలు అమృత తుల్యమైనవి. శిశువులను రోగాల బారి నుంచి కాపాడేందుకు తల్లిపాలను మించినది ఈ సృష్టిలో లేదు. అందుకే ప్రభుత్వం ఏటా ఆగస్టు మొదటి వారం అంతా తల్లిపాలు వారోత్సవాలు నిర్వహిస్తూ, పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నారు. పుట్టిన కొద్ది సమయంలోనే బిడ్డకు తల్లి ముర్రుపాలను అందిస్తే అది రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. వైద్య పరిభాషలో ముర్రుపాలు టీకాతో సమానం. మహిళలు గర్భం దాల్చిన నాటి నుంచి తల్లి పాల ఆవశ్యకత. బిడ్డ పోషణ ఆరోగ్యంపై ఐసీడీఎస్ అధికారులు అంగన్‌వాడీ కార్యకర్తలు అవగాహన కల్పిస్తున్నారు. పుట్టిన బిడ్డకు తొలి ఆహారం మొదటి టీకా అమ్మపాలే. అందుకే తల్లిపాల ఆవశ్యకతను తెలిపేలా ఏటా ఆగస్టు మొదటి వారంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తారు. ఈ ఏడాది ఉండి నియోజకవర్గంలోని ఆకివీడు ఉండి కాళ్ల పాలకోడేరు మండలాల్లోని గ్రామాల్లోని 361 అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాలు వారోత్సవాల సందర్భంగా ఐసీడీఎస్ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. ఉండి నియోజకవర్గంలో నాలుగు మండలాల్లోని 1,287 మంది గర్భిణులు, 1,167 మంది బాలింతలు ఉన్నారు. మహిళలు గర్భం దాల్చిన నుంచి తల్లి పాల ఆవశ్యకతను బిడ్డ పోషణ- ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్నారు. లేనిపోని అపోహలతో అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లిపాలకు దూరం చేయరాదని వైద్యులు సూచిస్తున్నారు. ఆగస్టు 1 తేదీ నుంచి వారం రోజుల పాటు అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేపట్టారు. కేంద్రాల్లోని పిల్లల తల్లులు గర్భిణులకు అవగాహన కల్పించేందుకు ఐసీడీఎస్ అధికారులు కార్యకర్తలు ఆయాలు సూపర్‌వైజర్లు సిద్ధంగా ఉన్నారు.

ముర్రుపాలతో రోగ నిరోధక శక్తి

శిశువు జన్మించిన తొలి రోజుల్లో తల్లి పాలు చిక్కగా పసుపు రంగులో ఉంటాయి. వీటిని ముర్రుపాలు అంటారు. ప్రోటీన్లు, విటమిన్లు, ఖనిజ లవణాలు అధికంగా ఉండే ముర్రుపాలను శిశువు తీసుకుంటే రోగనిరోధక శక్తి పెరుగుతుంది. శిశువు జన్మించిన తొలి అరగంటలోపే ముర్రుపాలు పట్టడం ద్వారా చాలా రోగాల నుంచి వారిని రక్షించవచ్చు. ముర్రుపాలు శిశువు పేగులకు బలాన్ని ఇచ్చి జీర్ణశక్తిని పెంచుతుంది. కామెర్లు, విరోచనాలు వంటి రుగ్మతల నుంచి శిశువును కాపాడుతాయి.

ప్రయోజనాలు

తల్లిపాలలో ప్రోటీన్లు, లాక్టో పెరిన్, కొలొస్ట్రం కొన్ని కీలకమైన హార్మోన్లు రోగనిరోధక శక్తికి దోహదపడే బ్యాక్టీరియా ఉంటాయి. తల్లిపాలు తాగే పిల్లలు ఎక్కువగా బలంగా ఉంటారు. వ్యాధి నిరోధక శక్తి ఎక్కువగా ఉంటుంది. తెలివితేటలు అధికంగా ఉంటాయి. డబ్బా పాలు తాగే పిల్లల కంటే చురుగ్గా ఉంటారు. బిడ్డకు పాలు ఇవ్వడం ద్వారా తల్లి బిడ్డల మధ్య అనుబంధం పెన వేసుకుంటుంది. తల్లిపాలు తేలికగా జీర్ణం అవుతాయి. బిడ్డ దవడలు దృఢంగా అవుతాయి. పాలిచ్చే తల్లులకు నెలసరిలో రక్తస్రావం తక్కువగా ఉంటుంది. తల్లులకు రొమ్ము, గర్భాశయం క్యాన్సర్ దరి చేరవు.

ఆరు మాసాల వరకు తల్లిపాలే ఆహారం

బిడ్డ పుట్టాక తొలి ఆరు మాసాలు తల్లిపాలే ఆహారం తప్పని పరిస్థితుల్లో మినహా వేరే ఏ పాలు బిడ్డకు పట్టించకుండా ఉండడమే మంచిదని వైద్యులు పేర్కొంటున్నారు. మొదటి రెండు నెలల్లో బిడ్డకు రెండు గంటలకు ఒకసారి పాలు పట్టాలి. రాత్రిళ్లు పాలు ఇవ్వడంతో తల్లి మెదడు నుంచి ప్రోల్యాక్టిన్ ఎక్కువగా స్రవిస్తుంది. ఇది పాల ఉత్పత్తికి అవసరమైన అతి ముఖ్యమైన హార్మోన్. ఎంత రాత్రి అయినా తల్లిపాలు ఇవ్వడం బిడ్డకు క్షేమం. శ్వాస కోస, అలర్జీ, ఆస్తమా, చర్మ వ్యాధుల నుంచి పిల్లలకు రక్షణ లభిస్తుంది. ఆరు మాసాల తర్వాత తల్లిపాలతో పాటు వైద్యుల సూచనల మేరకు ఇతర ఆహారం ఇవ్వాలి.

ముర్రుపాల ఆవశ్యకత వివరిస్తున్నాం



అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రతి గర్భిణీకి బాలింతకు తల్లి పాలు ఆవశ్యకతను వివరిస్తున్నాం. బిడ్డ పుట్టిన వెంటనే ముర్రు పాలు ఇచ్చేలా అవగాహన కల్పిస్తున్నాం. తల్లి పాల వారోత్సవాల ద్వారా అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు బాలింతలకు తల్లి పాలు ప్రాముఖ్యతను తెలియజేస్తున్నాం

–వాణి విజయరత్నం, సీడీపీఓ, ఐసీడీఎస్ ప్రాజెక్ట్, ఆకివీడు

మొదటి ఆరు నెలలూ తల్లిపాలు తప్పనిసరి



పుట్టిన బిడ్డకు ఆరు నెలల వరకు తల్లిపాలు ఇవ్వాలి. బాలింతలు ఎలాంటి అపోహలకు తావివ్వకుండా రోజుకు పది నుంచి 12 సార్లు బిడ్డకు పాలు ఇవ్వాలి. బిడ్డ ఏడ్చిన ప్రతిసారి తల్లిపాలు పట్టించవచ్చు. ఆరు నెలల వరకు తల్లిపాలు ఇస్తే బిడ్డ ఆరోగ్యంగా పెరుగుతుంది.

– చినమిల్లి రంగమ్మ నాయుడు, పీహెచ్‌సీ వైద్యాధికారి, పాలకోడేరు

తహసీల్దార్ల నియామకం



ఎన్.వెంకటేశ్వరరావు, తహసీల్దార్, ఆకివీడు



కె. నాగార్జున , ఉండి తహసీల్దార్

ఆకివీడు: మండల తహసీల్దార్‌గా నందూరి వెంకటేశ్వరరావును నియమిస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం తహసీల్దార్‌గా పనిచేసిన వెంకటేశ్వరి తూర్పుగోదావరి జిల్లాకు బదిలీ అయ్యారు. గతంలో ఆకివీడు తహసీల్దార్‌గా పనిచేసి ఎన్నికల ముందు మచిలీపట్నం తహసీల్దార్‌గా వెంకటేశ్వరరావు వెళ్లారు. మళ్లీ ఆయన్ని ఆకివీడు తహసీల్దార్‌గా నియమిస్తూ ఆదేశాలిచ్చారు.

ఉండి తహసీల్దార్‌గా నాగార్జున

ఉండి: ఉండి కొత్త తహసీల్దార్‌గా కె. నాగార్జున నియమితులయ్యారు. ఎన్నికల అనంతరం జరిగిన సాధారణ బదిలీ భాగంగా నియోజకవర్గంలోని పాలకోడేరులో తహసీల్దార్‌గా పనిచేస్తున్న నాగార్జున ఉండి వచ్చారు. సోమవారం ఆయన బాధ్యతలు చేపనున్నారు. ఇక్కడ కొద్దిరోజులుగా డిప్యూటీ తహసీల్దార్ ఎస్వీఎస్ నాయుడు ఇన్‌ఛార్జ్ తహసీల్దార్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

వీరవాసరం తహసీల్దార్‌గా ఏవీ రామాంజనేయులు

వీరవాసరం: వీరవాసరం తహసీల్దార్‌గా ఏవీ రామాంజనేయులు నియమితులయ్యారు. ప్రస్తుత మండల తహసీల్దారుగా పనిచేసిన జే సుశీలదేవి కృష్ణ జిల్లాకు బదిలీపై వెళ్లారు. ప్రస్తుతం డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న సుబ్బారావు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా వ్యవహరిస్తున్నారు.

నూకాలమ్మ వెండి చీర తయారీకి విరాళాలు

భీమవరం: భీమవరం 33వ వార్డులో వేంచేసియున్న నూకాలమ్మవారికి వెండి చీర తయారు చేసేందుకు పట్టణానికి చెందిన సరిపిడకల రామకృష్ణ- అనంత లక్ష్మి దంపతులు రూ.10 వేలు, హైదరాబాద్‌కు చెందిన యడ్ల కామేశ్వరరావు- విజయలక్ష్మి దంపతులు రూ.9 వేలు, సిరియాల శివశంకర్ - శ్రీదేవి దంపతులు రూ.5వేలు విరాళంగా అందించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు రౌతు అప్పారావు, మెట్టా మురళికృష్ణ, సిరియాల నాగేశ్వరావు, రౌతు హరిబాబు, తాళ్ళపూడి పరమేశ్వరరావు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ పరామర్శ

వీరవాసరం: భీమవరం మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ వీరవాసరం మండలంలోని అండలూరు, పంజా వేమవరం, వీరవల్లివారిపాలెం గ్రామాల్లో శనివారం పలువురిని పరామర్శించారు. కార్యకర్తలకు వైఎస్సార్ సీపీ ఎప్పుడూ అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. ఆయన వెంట కోటిపల్లి బాలదుర్గ నాగమల్లేశ్వరరావు, మానుకొండ ప్రదీప్ కుమార్, గొలగాని సత్యనారాయణ ,బొల్లంపల్లి శ్రీనివాస చౌదరి ,దాసరి మాణిక్యాలరావు, పంజా జానకి రామయ్య ,పంజా శ్రీనివాసరావు, తాడాల దుర్గా వరప్రసాద్, కందుల సురేష్, బాబి, జయరాం పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

ఆకివీడు: వర్షాకాలం, వరదల కాలం కావడంతో ప్రజలు అంటువ్యాధులు ప్రబలుతాయనే భయాందోళనలో ఉన్నారు. మండలంలోని చినకాపవరంలో సర్పంచ్ నాతిరెడ్డి ఆదిలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకుడు నాతిరెడ్డి అన్నవరం, గ్రామ కార్యదర్శి ఆనంద భూషణం ఆధ్వర్యంలో పారిశుధ్య మెరుగు పనులు శనివారం విస్తృతంగా చేపట్టారు. గ్రామంలోనూ, గ్రామ శివారు ప్రాంతంలోని రామయ్య గూడెం ప్రాంతంలో చెత్తను తొలగించి, కచ్చా డ్రెయిన్ల ద్వారా వర్షపు నీటిని తొలగించే చర్యలు పూర్తి చేశారు. ఆయా వార్డుల్లో బ్లీచింగ్ చల్లించారు.

తల్లి పాల ప్రాముఖ్యతను మరువద్దు



పెద ఆమిరంలో అంగన్‌వాడీల ఆధ్వర్యంలో సామూహిక సీమంతాలు



యండగండిలో తల్లిపాల ప్రాముఖ్యతను వివరిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

ఆకివీడు: తల్లిపాల ప్రాముఖ్యతను మరువద్దని సీహెచ్ఓ అధికారిణి డీ. మౌనిక చెప్పారు. మండలంలోని తరటావ గ్రామంలో తల్లిపాల వారోత్సవాలు శనివారం నిర్వహించారు. పలువురు చిన్నారులతో తల్లులు, గర్భిణులు హాజరయ్యారు. కార్యక్రమంలో సర్పంచ్ ముప్పానేని నాగేశ్వరరావు, ఏఎన్ఎం సంధ్యారాణి, ఆశ వర్కర్, అంగన్‌వాడీ వర్కర్ మల్లారెడ్డి భాను కుమారి పాల్గొన్నారు.

మండలస్థాయిలో తల్లిపాల వారోత్సవం

కాళ్ల: తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శనివారం పెదఆమిరం గ్రామంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల1 నుంచి 7 వరకు నిర్వహించనున్న తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం ఐసీడీఎస్ ఆకివీడు ప్రాజెక్ట్, ఆధ్వర్యంలో మండలస్థాయిలో నిర్వహిస్తున్నారు. సీడీపీఓ వి.వాణిరత్నం మాట్లాడుతూ గర్భిణులు డెలివరీ అయిన 1 గంటలోపు బిడ్డకు ముర్రుపాలు ఇవ్వాలని కోరారు. గర్భిణులకు సామూహిక సీమంతాలు చేశారు. డాక్టర్ డి సునీత, సూపర్‌వైజర్లు కె. సూర్యకుమారి, పార్వతి, హెల్త్ సిబ్బంది, సచివాలయం సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

అమ్మపాలు అమృత తుల్యం

భీమవరం అర్బన్: అమ్మ పాలు బిడ్డకు అమృత తుల్యమని భీమవరం ఐసీడీఎస్ సీడీపీవో టీకేవీ లక్ష్మీకాంతం అన్నారు. భీమవరం మండలంలోని చినగరువులోని అంగన్‌వాడీ సెంటర్‌లో తల్లిపాలు వారోత్సవాల్లో భాగంగా శనివారం అమ్మపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ సూపర్ వైజర్ కె.సరళ, సిబ్బంది పాల్గొన్నారు. తల్లి వారోత్సవాల్లో భాగంగా తల్లి పాల ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎమ్ బస్తా మహలక్ష్మి, ఆశాజ్యోతి ఝాన్సీ, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు వ్యాధినిరోధక టీకా

ఉండి: తల్లిపాలే బిడ్డకు అన్ని వ్యాధుల నుంచి రక్షించే టీకాలుగా వ్యాధినిరోధక శక్తిని ఇస్తాయని ఐసీడీఎస్ యండగండి సెక్టార్ సూపర్‌వైజర్ వీ నిర్మల అన్నారు. ఐసీడీఎస్ ఆకివీడు సీడీపీఓ ఆదేశానుసారం తల్లిపాల వారోత్సవాల సందర్భంగా గర్భిణులు, బాలింతలకు అవగాహన కార్యక్రమాన్ని శనివారం యండగండి-2 అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

ఆర్టీవో కార్యాలయం వద్ద స్కూల్ బస్ డ్రైవర్ల ఆందోళన

భీమవరం: ప్రైవేటు స్కూల్ బస్ డ్రైవర్లను అన్యాయంగా కొట్టారంటూ భీమవరం ఆర్టీవో కార్యాలయం వద్ద వారు ఆందోళన చేపట్టారు. ఆర్టీవో కార్యాలయ సిబ్బందితో డ్రైవర్‌కు క్షమాపణ చెప్పించడంతో వారు ఆందోళన విరమించారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. భీమవరంలోని ఓ ప్రైవేటు విద్యా సంస్థ బస్ డ్రైవర్ శుక్రవారం రాత్రి నిర్లక్ష్యంగా స్కూల్ బస్ నడుపుతున్న సమయంలో ఆర్టీవో కార్యాలయ ఉద్యోగి ఒకరు గమనించి బస్ నిలిపి డ్రైవర్‌ను మందలించి శనివారం కార్యాలయానికి రావాలని ఆదేశించాడు. ఆర్టీవో కార్యాలయానికి వచ్చిన డ్రైవర్‌ను ఆ ఉద్యోగి కొట్టడంతో స్కూల్‌కు చెందిన కొంతమంది డ్రైవర్లు ఆందోళన చేపట్టారు. ఆర్టీవో జోక్యం చేసుకుని ఇరువురితో చర్చించారు. బస్ డ్రైవర్‌కు ఆర్టీవో కార్యాలయ ఉద్యోగి క్షమాపణ చెప్పడంతో డ్రైవర్లు ఆందోళన విరమించారు.

5న కూటమి ప్రభుత్వ వేధింపులకు నిరసనగా ధర్నా



భీమవరంలో సీఐటీయూ సమావేశంలో మాట్లాడుతున్న రాజా రామ్మోహన్‌రాయ్

భీమవరం: తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత చిరుద్యోగులు, స్కీం వర్కర్లపై వేధింపులు పెరిగాయని దీనిపై రాష్ట్రవ్యాప్తంగా నిరసన చేపట్టనున్నట్లు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె రాజారామ్మోహన్‌రాయ్ అన్నారు. భీమవరం సీఐటీయూ కార్యాలయంలో శనివారం జేఎన్‌వీ గోపాలన్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రాజా రామ్మోహన్‌రాయ్ మాట్లాడుతూ ఇప్పటికే అనేక జిల్లాల్లో వేధింపులు కారణంగా ఉద్యోగాలను వదులుకున్నవారి సంఖ్య, ఆత్మహత్యలు పెరిగాయన్నారు. జిల్లాలోనూ అక్కడక్కడ చెదురు మదురు ఘటనలు వెలుగు చూస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వేధింపులకు నిరసనగా ఈ నెల 5న రాష్ట్ర వ్యాప్తంగా నిరసనల్లో భాగంగా పశ్చిమగోదావరి జిల్లాలో కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తామని ప్రకటించారు. ఈ సమావేశంలో డి కళ్యాణి, బి వాసుదేవరావు, ఎం ఆంజనేయులు పాల్గొన్నారు.

మోటార్ సైకిల్ మెకానిక్‌లకు బీమా సొమ్ము అందజేత



భీమవరంలో మెకానిక్ కుటుంబ సభ్యులకు బీమా సొమ్ము అందజేస్తున్న సంఘ నాయకులు

భీమవరం: భీమవరం మోటార్ సైకిల్ మెకానిక్‌ల వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులకు ఎల్లప్పుడు అండగా ఉంటుందని అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బందెల హనుమంతరావు, ముమ్మన విజయకుమార్ అన్నారు. శనివారం అసోసియేషన్‌కు చెందిన ఇద్దరు సభ్యులకు సంబంధించి బీమా సొమ్మును అసోసియేషన్ కార్యాలయంలో బాధితుల కుటుంబ సభ్యులకు అందించారు. మోటారు సైకిల్ ప్రమాదంలో మృతిచెందిన సీహెచ్ రాజుకు సంబంధించిన బీమా సొమ్ము రూ.1.53 లక్షల నగదును మృతుడి భార్య సీహెచ్ లక్ష్మికి అందించగా ప్రమాదానికి గురైన మెకానిక్ పి.రమణకు వైద్య సహాయానికి రూ. 80 వేల చెక్కును బాధితులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు ఈమని చంద్రమౌళి, కోశాధికారి బురిడి సత్య వరప్రసాద్, ఉపాధ్యక్షుడు తోట కిరణ్‌కుమార్, గాదం వీరభద్రరావు, అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి పట్నాల చిట్టిబాబు, నిమ్మల వెంకట్రావు, పేరాబత్తుల లక్ష్మణరావు, గెద్దా రామారావు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు



భీమవరంలో న్యాయవాదులకు క్రీడాపోటీలు సందర్భంగా మాట్లాడుతున్న ప్రసన్నకుమార్

భీమవరం: స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా భీమవరం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడాపోటీల్లో భాగంగా శనివారం షటిల్ పోటీలు డీఎన్నార్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించారు. షటిల్ డబుల్స్ విభాగంలో బండి ఫణి, చంద్రశేఖర్ వంశీ విన్నర్లుగా తరుణ్, శివాజీరాజు రన్నర్లుగా విజయం సాధించారు. జూనియర్స్ విభాగంలో తరుణ్ విన్నర్‌గా, బాలాజీ రన్నర్‌గా, సీనియర్స్ విభాగంలో సాయిశరణ విన్నర్‌గా, మేక శివప్రసాద్ రన్నర్‌గా, సూపర్ సీనియర్స్ విభాగంలో బండి ఫణి విన్నర్‌గా, శివాజీ రాజు రన్నర్‌గా విజయం సాధించారు. మహిళా విభాగంలో రాధా విన్నర్‌గా, అమూల్య రన్నర్‌గా సీనియర్స్ విభాగంలో దిన విన్నర్‌గా విజ్ఞానదేవి రన్నర్‌గా నిలిచారు. డబుల్స్ విభాగంలో రాధా, కీర్తి విన్నర్లుగా భాగ్యశ్రీ, శ్యామల రన్నర్లుగా విజయం సాధించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జనరల్ సెక్రటరీ అడపాల ప్రసన్నకుమార్, స్పోర్ట్స్ సెక్రటరీ హరి మాట్లాడుతూ న్యాయవాదులకు షటిల్ పోటీలతోపాటు చెస్, క్యారమ్స్ పోటీలు నిర్వహించామని విజేతలకు ఆగస్టు 15న న్యాయమూర్తుల చేతుల మీదుగా బహుమతులు అందిస్తామన్నారు.

పారిశుధ్య సమస్యలపై దృష్టి సారించాలి



మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శిరీష విశ్వనాథరాజు

కాళ్ల: గ్రామాల్లో పారిశుధ్య సమస్యలపై అధికారులు దృష్టి సారించి తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీపీ పెన్మెత్స శిరీష విశ్వనాథరాజు సూచించారు. కాళ్ల మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండలంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులపై మండల అధికారులు వివరించారు. ఈ సందర్భంగా పలుగ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు సాగునీటి, తాగునీటి సమస్యలు తలెత్తకుండా పంట, మురుగు కాలువల అభివృద్ధి చేయాలని అధికారులను కోరారు. మురుగు కాలువల సమస్యపై ఇప్పటికే ఉన్నత అధికారులు, ఎమ్మెల్యేల దృష్టికి తీసుకువెళ్లామని డ్రెయినేజీ శాఖ ఏఈ జయప్రకాశ్ తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామాల్లో ఖాళీగా ఉన్న చెరువులను అభివృద్ధి చేసి తాగునీటి కోసం వినియోగించాలని స్పష్టం చేశారు. ప్రతి పంచాయతీ సర్పంచ్ కార్యదర్శి గ్రామాల్లో శుద్ధి చేసిన నీటిని కుళాయిల ద్వారా పంపిణీ చేయాలని సూచించారు. ఇటీవల కురిసిన వర్షాలకు ముంపునకు గురైన నారుమడులు పాడైపోవడంతో ప్రభుత్వం 80 శాతం సబ్సిడీపై విత్తనాలు సరఫరా చేయనున్నట్లు వ్యవసాయ శాఖ అధికారి జయవాసుకి తెలిపారు. పలువురు సర్పంచులు మాట్లాడుతూ గ్రామాల్లో వీధి కుక్కల బారి నుంచి రక్షించాలని కోరారు. అధ్వానంగా ఉన్న కాళ్ల – కొలనపల్లి ఆర్అండ్‌బీ రహదారిని అభివృద్ధి చేయాలని సర్పంచ్ అధికారులను కోరారు. సమావేశంలో జెడ్పీటీసీ పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, సర్పంచ్‌ల ఛాంబర్ జిల్లా అధ్యక్షుడు కొలుకులూరి ధర్మరాజు, ఎంపీడీఓ జి.స్వాతి, పెనుమత్స విశ్వనాథరాజు, ఏఓ ఎం.ఎస్. ప్రభాకరరావు, ఎంఈఓ వెంకటేశ్వరరావు, ఏఈలు టి. శ్రీనివాసరావు, కె.శ్రీవారి రాజు, పి.రాంబాబు, ఫణిశంకర్, పి.ఆంజనేయరాజు, జయప్రకాష్, ఏవో సి.జయవాసుకి, ఆర్ఐ లక్ష్మీకిరణ్, డాక్టర్లు చంద్రబాబు, సునీత, ఈఓపీఆర్డీ భాస్కరరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, పలు గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాధుల బారి నుంచి పశువులను కాపాడాలి

భీమవరం అర్బన్: సీజనల్ వ్యాధుల బారి నుంచి పశువులను కాపాడాలని భీమవరం డివిజన్ ఉప సంచాలకులు డాక్టర్ జావర్ హుస్సేన్ అన్నారు. భీమవరం మండలంలోని గొల్లవానితిప్పలో పశు సంవర్థక శాఖ, రాష్ట్రీయ గోకుల్ మిషన్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ జావర్ హుస్సేన్ మాట్లాడుతూ పశు పోషణకు ప్రభుత్వం 75 శాతం సబ్సిడీతో మేలు జాతి గడ్డి విత్తనాలు అందిస్తున్నామన్నారు. జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ ఉప సంచాలకులు డాక్టర్ జేసురత్నం మాట్లాడుతూ లింగ నిర్ధారణ (పెయ్యి దూడలు మాత్రమే జన్మించేలా) సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చిందని రైతులకు వివరించారు. 91 పశువులకు వివిధ రకాల పరీక్షలు చేసి, 21 దూడలకు నట్టల నివారణ మందు వేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిల్లే వెంకటేష్, మండల పశువైద్యాధికారులు డాక్టర్ పి. పుండరీబాబు, డాక్టర్ లలిత, డాక్టర్ మౌర్య సత్యేంద్ర, పోకల కిషోర్, గుద్దటి త్రిమూర్తులు, కొట్టు రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలలో అట్టహాసంగా ఎన్నికలు



ప్రమాణస్వీకారం చేయిస్తున్న హెచ్ఎం



ఎస్పీఎల్ ఎన్నికకు ఓట్లు వేసేందుకు క్యూలో నిలబడ్డ విద్యార్థులు

ఆకివీడు: పెదకాపరవం లోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎస్పీఎల్ (లీడర్) ఎన్నిక కార్యక్రమం శనివారం అట్టహాసంగా నిర్వహించారు. ఈ నెల 2న ఏడుగురు విద్యార్థులు నామినేషన్లు వేయగా, ఇద్దరు ఉపసంహరించుకున్నారు. శనివారం ఉదయం ఐదుగురు విద్యార్థులకు ఎన్నిక జరిగింది. బ్యాలెట్ బాక్సుల్లో ఓటు హక్కును విద్యార్థులు వినియోగించుకున్నారు. పోటీలో ఎస్పీఎల్‌కు ప్రతాప్ రాట్నాలకు అత్యధిక ఓట్లు రాగా మొదటి ఎస్పీఎల్‌గా, దొనిక్ పొన్నాడ ద్వితీయ, సాయిదుర్గ మేడపాటి తృతీయ స్థానంలో నిలిచారు. గెలుపొందిన విద్యార్థులతో ప్రధానోపాధ్యాయులు బందెల కాళహస్తేశ్వరుడు ప్రమాణస్వీకారం చేయించారు. పాఠశాల అభివృద్ధికి, మౌలిక వసతుల్ని కాపాడుకునేందుకు, పటిష్టమైన విద్యా బోధనకు కృషి చేస్తామని వారు ప్రమాణ స్వీకారం చేశారు. ఎన్నికలో విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సాధారణ ఎన్నికల ప్రక్రియపై అవగాహనకు ఈ ఎన్నికలు ఎంతో ఉపయోగపడతాయని పలువురు విద్యార్థులు అన్నారు.